
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





నరసాపురం ఎవరికి వరం

బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ మెజారిటీపై కూటమి లెక్కలు

క్రాస్ ఓటింగ్‌తో వైసీపీ ఎంపీ అభ్యర్థి ఉమాబాల గట్టెక్కుతారంటూ ఆ పార్టీ నేతల ఆశలు

'ఎన్నికల్లో బాగా కష్టపడ్డాం. మన పని మనం చేశాం. గెలుపు ఫిఫ్టీ-ఫిఫ్టీ. ఇక మనం చేయగలిగింది ఏమీ లేదు' భీమవరంలో అధికార పార్టీ నేత తమ కేడర్‌కు ఇలాంటి సందేశం ఇచ్చారు.

వాస్తవానికి వైసీపీ సొంత నివేదికల్లో ఈ నియోజకవర్గం జిల్లాలోనే పెద్ద బలంగా కనిపించింది. సొంత సర్వేల్లోనూ ఇది ముందు వరుసలో ఉంది. కూటమికంటే అధిక శాతంతో ఉన్నట్టు లెక్కలు తేల్చారు. తీరా ఎన్నికల సమయానికి పరిస్థితులు తారుమారయ్యాయి. అక్కడ అధికార పార్టీ నేతే ఫిఫ్టీ- ఫిఫ్టీ ఛాన్స్ అంటూ చెప్పడంతో విజయం ఎవరి వైపు అన్నది తేలిపోయింది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

'సంక్షేమ పథకాలు ఇచ్చాం. ఎన్నికలు ఏకపక్షం కావాలి. కానీ అలా జరగలేదు. గట్టి పోటీ నెలకొంది' అంటూ తాడేపల్లిగూడెంలో అధికార పార్టీ నాయకుడు ఒకరు చెప్పుకొచ్చారు. గెలుపుపై చెప్పలేమంటూ పెదవి విరిచారు. ఈ నియోజకవర్గంలో పార్టీ ఓటమి పాలైనా జగన్ సీఎం అవుతారంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇవే తరహా లెక్కలు, అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ఓటింగ్ సరళిపై కిందా మీదా పడుతున్నారు. అంటే పరోక్షంగా ఓటమిని అంగీకరిస్తున్నారు. ఆ ప్రభావం లోక్‌సభ స్థానంపైనా పడింది.

సామాజిక సమీకరణలే దిక్కు

ఎన్నికల ముందు వైసీపీ కులాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించింది. ప్రధానంగా ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల సామాజిక వర్గంతో జిల్లావ్యాప్తంగా సమీక్షలు నిర్వహించారు. అధికార పార్టీ అభ్యర్థులు ఆ సామాజికవర్గంపై ప్రధానంగా ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో అత్యధికంగా ఉమాబాల సామాజికవర్గం ఉందని అంచనాతోనే ఆమెకు టిక్కెట్ కేటాయించింది. సామాజిక సమీకరణాలను నమ్ముకుంది. ఎన్నికల్లో ఇది కలిసి వస్తుందని





నేతలు భావించారు. ఓటింగ్ సరళిని చూస్తే ఈ సమీకరణాలు వైసీపీకి పెద్దగా కలిసి వచ్చినట్లు కనిపించడం లేదు. నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు మాత్రం.. ఎంపీ అభ్యర్థి సామాజిక వర్గమే తమకు కలిసి వస్తుందని అంచనాలు వేస్తున్నారు. అదే తమను గెలుపు తీరానికి చేరుస్తుందని ఆశతో ఉన్నారు. అవే లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు సంక్షేమ పథకాలు పని చేశాయని, అందుకే పాజిటివ్ ఓటింగ్‌తో ప్రజలు పోలింగ్ స్టేషన్లకు వచ్చారంటూ లెక్కలు కడుతున్నాయి. తమ నియోజకవర్గం ఎలా వున్నా రాష్ట్రంలో అధికారం మాత్రం వైసీపీదేనంటూ నియోజకవర్గాల వారీగా వైసీపీ నాయకత్వం లెక్కలు వేసుకుంటోంది. పరోక్షంగా నియోజకవర్గాల్లో తమ ఓటమిని ముందుగానే అంగీకరిస్తున్నారు. ఇదే ప్రభావం నర్సాపురం లోక్‌సభపైనా పడుతోంది. నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ జరిగి ఉంటుందని వైసీపీ నాయకత్వం అంచనా వేసుకుంటోంది. అదే లోక్‌సభను గెలుపు తీరాన చేర్చే అవకాశం ఉంటుందని కాసింత నమ్మకంతో ఉన్నారు.

మెజారిటీపైనే కూటమి లెక్కలు

నర్సాపురం పార్లమెంట్ స్థానాన్ని కూటమి తమ ఖాతాలో వేసుకుంది. బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ సునాయాస విజయం సాధిస్తారన్న ధీమాతో కూటమి ఉంది. మెజారిటీపైనే ఇప్పుడు లెక్కలు వేసుకుంటున్నారు. తొలుత బీజేపీలో క్రాస్ ఓటింగ్ భయం వెంటాడింది. భీమవరం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని లెక్కలు వేసుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులకంటే ఎంపీ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ బెడద ఉంటుందని భావించారు. తక్కువ మెజారిటీతో గట్టెక్కుతామంటూ ముందుగానే ఒక అంచనాకు వచ్చారు. అయితే పోలింగ్ సరళితో బీజేపీ ఊపిరి పీల్చుకుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ క్రాస్ ఓటింగ్ పెద్దగా ప్రభావం చూపలేదు. పైగా ఆచంటలో అనుకున్న దానికంటే కూటమికి అధికంగా ఓట్లు పడతాయని అంచనా వేశారు. దీంతో మెజారిటీ కూడా పెరుగుతుందంటూ లెక్కలు కడుతున్నారు. కూటమి ఎంపీ అభ్యర్థిపై బీజేపీ అధినాయకత్వం తొలి నుంచి మొగ్గుతో ఉంది. ఆర్థిక వనరులను సమకూర్చింది. నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు ప్రతిచోట రెండు ఓట్లు కూటమికే వేయాలంటూ ప్రజలను కోరుతూ వచ్చారు. మరోవైపు బీజేపీ శ్రేణులు సైతం ప్రత్యేకంగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఇవన్నీ ఎన్నికల్లో సానుకూల ప్రభావం చూపుతున్నట్టు ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. జగన్ సోషల్ ఇంజనీరింగ్‌ను ఈసారి జనం పరిగణనలోకి తీసుకోలేదు. సంక్షేమంతో కూడిన అభివృద్ధిని ఆకాంక్షించారు. అందుకే కూటమి వైపు నిలిచారు. ప్రధాని మోదీ రాజమండ్రి వచ్చినప్పుడు ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఆశీస్సులు అందించారు. ఇవన్నీ ఎన్నికల్లో ప్రభావం చూపాయని బీజేపీ విశ్వసిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకత ఓటింగ్‌లో కనిపించింది. మెజారిటీ 60 వేల పైమాటే అంటూ బీజేపీ ధీమాతో ఉంది. పూర్తి ఫలితం తెలియాలంటే జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే!

కాయ్ రాజా కాయ్

ఆకివీడు, మే 15 : పందెంరాయుళ్లు రంగంలోకి దిగారు. ఈ సారి ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారనే అంశంపై జోరుగా పందేలు కడుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది ? ఫలానా నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? ఎంత మెజార్టీ వస్తుంది ? తదితర అంశాలపై పందేలు కడుతున్నారు. పదిహేను రోజుల్లో పోలింగ్ జరుగుతుందనగా వైసీపీ అభ్యర్థులకు సంబంధించిన పందెంరాయుళ్లు పెద్ద ఎత్తున పందేలకు ఆహ్వానించారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ గాలి వీయడంతో కూటమికి అనుకూలంగా పందేలు కట్టేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు బూత్ వారీగా లెక్కలు కట్టి గెలుపోటములపై ఒక అంచనాకు వచ్చిన కొందరు వైసీపీ పెద్దలు కిందిస్థాయి నేతలను హెచ్చరిస్తున్నారు. పందేల విషయంలో ఆచితూచి అడుగులు వేయాలని ప్రతిష్ఠకు పోకుండా జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు. జిల్లాలో టీడీపీ అభ్యర్థులు గెలవడంతోపాటు, రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనే పందేలకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. టీడీపీకి వ్యతిరేకంగా పందేలు కట్టే విషయంలో వైసీపీ నేతలు ఒకడుగు వెనక్కి తగ్గుతున్నారు.



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు

నిఘా నీడలో ఈవీఎంలు

స్ట్రాంగ్ రూమ్స్ పరిసరాల్లో 144 సెక్షన్



భీమవరం క్రైం, మే 15 : జిల్లావ్యాప్తంగా ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎం బాక్స్‌లను ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచడం జరిగిందని జిల్లా ఎస్పీ వి.అజిత తెలిపారు. బుధవారం ఆమె స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటుచేసిన మూడంచెల కేంద్ర పోలీస్ బలగాల గార్డును, జిల్లా ఆర్మ్ పోలీస్ గార్డును, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. స్ట్రాంగ్ రూమ్‌కి నలువైపులా పోలీస్ పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయడం జరిగిం దని, నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న అవాంఛనీయ సంఘటనకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తూ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

మూడంచెల భద్రత : జేసీ ప్రవీణ్ ఆదిత్య

ఉండి, మే 15 : ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడెంచెల భద్రత వ్యవస్థ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టరు, ఉండి ఆర్వో ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. వచ్చే 19 రోజులు ఈవీఎంలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిందేనని రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్స్ వద్ద భద్రతతోపాటు 144 సెక్షన్ అమలు జరుగుతుందన్నారు. పోలీసులతోపాటు కేంద్ర సాయుధ బలగాలు స్ట్రాంగ్ రూమ్ వద్ద పహారా కాస్తున్నాయని తెలిపారు. ఈవియంలు భద్రపరిచిన రూమ్ ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఒక డీఎస్పీ స్థాయి అధికారి, ఒక సీఐ, నలుగురు ఎస్ఐలతోపాటు ఇతర సిబ్బంది వున్నారన్నారు. సీసీ టీవీ కెమెరా ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు.



మార్కెట్‌కు ఎన్నికల కళ

- ఎన్నికల్లో ఓటర్లకు తాయిలాలు
- బంగారం, గృహోపకరణాలకు భారీగా వెచ్చిస్తున్న జనం
- ఊపందుకున్న వ్యాపారాలు
- చిరు వ్యాపారులకు పండుగ

- తాడేపల్లిగూడెంలో లక్ష్మి అనే మహిళ ఇంట్లో నాలుగు ఓట్లు ఉన్నాయి. వైసీపీ నుంచి రూ.10 వేలు అందాయి. కూటమి నుంచి మరో రూ.6 వేలు ముట్టజెప్పారు. అంతే లక్ష్మి మార్కెట్‌కు వెళ్లి ఆ మొత్తంతో బంగారం కొనుగోలు చేసింది.
- భీమవరంలో రామారావు అనే వ్యక్తి ఇంట్లో ఏడు ఓట్లు ఉన్నాయి. కూటమి, వైసీపీ నుంచి ఆ ఇంటికి రూ.28 వేలు ముట్టాయి. ఎండల మండిపోతుండడంతో మార్కెట్‌కు వెళ్లి ఆ మొత్తంతో ఏసీ కొనుగోలు చేశాడు.

పాలకొల్లు, మే 15:సార్వత్రిక ఎన్నికల వేళ మార్కెట్‌కు కొత్త కళ వచ్చింది. పోటీలో వున్న అభ్యర్థులు ఇచ్చిన తాయిలాలు ఇప్పుడు ఓటర్ల చేతుల్లో తళతళలాడుతున్నాయి. చిరు వ్యాపారాలతోపాటు అన్ని వర్తక సముదాయాలు కొనుగోలుదార్లతో కళకళలాడుతున్నాయి. వాస్తవంగా ఆర్థిక సంవత్సరం ఆరంభంలో కొనుగోళ్ళ వృద్ధి మెరుగ్గా ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నిరుత్సాహంగా మొదలైంది. మే 13న సార్వత్రిక ఎన్నికలు జరగడంతో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి మే 13వ తేదీ వరకూ మార్కెట్‌లో వ్యాపారాలు క్షీణ దశకు చేరుకున్నాయి. ఏటా కమోడిటీస్ కొనుగోళ్ళ వృద్ధి రేటు ఎనిమిది నుంచి పది శాతం పెరుగు తుంటుంది. ఈ ఏడాది ఎన్నికలు ఉండటంతో విఫణిలో అమ్మకాలు తిరోగమనం పట్టాయి. ఎన్నికల అనంతరం మే 14 నుంచి మార్కెట్‌కు కళ వచ్చింది. జిల్లాలోని ప్రధాన పట్టణాలతోపాటు గ్రామాలలోనూ వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఎన్నికలకు ముందు మార్కెట్‌లో బంగినపల్లి, రసాలు వంటి మామిడికాయలు పరక ధర రూ.200 నుంచి 300 ఉండగా ఇప్పుడు ఆ ధర నాలుగు నుంచి ఐదు వందలకు పెరిగింది. ఈ నెలాఖరు వరకూ మామిడి ఎగుమ తులు అధికంగా ఉండే అవకాశాలు ఉండటంతో కొబ్బరి మార్కెట్ తిరోగమనంలోకి వెళ్ళింది. ఎన్నికలకు ముందు రైతు వద్ద 1000 కాయల ధర రూ.9,500 ఉంటే ఇప్పుడు రూ.8.000లకు పడిపోయింది.

కోట్లాది రూపాయల సొమ్ము ఓట్ల కొనుగోళ్ళకు వెచ్చించడంతో సామాన్య మధ్య తరగతి ప్రజల్లో అధిక శాతం ఆ సొమ్మును వివిధ వస్తువుల కొనుగోళ్లకు వినియోగి స్తున్నారు. దీంతో మూఢమి ఉన్నప్పటికీ వస్త్ర దుకాణాలలో కొంత మేర అమ్మకాలు పెరిగాయి. బంగారం షాపుల్లో చిన్న తరహా కొనుగోళ్ళు అధికంగా జరుగుతున్నాయి. ఇతర గృహోపకరణాలు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు గ్రామీణంలో రైతులు దాళ్వా మాసూళ్ల సొమ్ము పలువురి చేతికి అందడంతో వివిధ వస్తువుల కొనుగోళ్లకు మార్కెట్ వైపు దృష్టి సారిస్తున్నారు.





పాలకొల్లులో బిర్యానీ పాయింట్ల వద్ద రద్దీ

జిల్లాలోని ఆయా నియోజకవర్గాలను బట్టి ఒక్కొక్క కుటుంబానికి రూ.7,500 నుంచి రూ.10 వేల వరకూ ఓట్ల సొమ్ము వచ్చింది. పాలకొల్లు నియోజకవర్గంలో సుమారు రూ.40 కోట్లు పంపిణీ జరిగింది. ఈ మొత్తంలో 50 శాతం అంటే సుమారు 20 కోట్లు వచ్చే నెల రోజుల్లో మార్కెట్‌లో కొనుగోళ్ళకు వచ్చే అవకాశం ఉంది. అలాగే రియల్‌ఎస్టేట్ రంగం పుంజుకోవడానికి మరో రెండు నెలల సమయం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేది టీడీపీ కూటమేనని ముమ్మర ప్రచారం జరుగుతుండటంతో రియల్‌బూమ్ మొదలవుతోంది. జిల్లాలో సుమారు రూ.400 కోట్లు రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికలలో ఖర్చు చేశారని ఒక అంచనా. ఇంత పెద్ద మొత్తం లక్షలాది మంది ఓటర్లకు పరోక్షంగా చిన్న మొత్తాలుగా చేరడంతో ఆ ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారంపై పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేస్తే జూలై నాటికి జిల్లాలో భూముల ధరలు 20 నుంచి 30 శాతం పెరగవచ్చునని మార్కెట్ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.

చిలక్కొట్టుడు !

- ఓట్ల కొనుగోళ్లలో అధికార పార్టీకి ఝలక్
- తాయిలాల పంపిణీలో నేతల నొక్కుడు
- పెద్ద ఎత్తున ఫిర్యాదులు.. పంచాయితీలతో తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు

నర్సాపురం, మే 15 : ఎన్నికల్లో ఓటర్లకు ఇచ్చిన తాయిలాల్లో పార్టీ కేడర్ చేతివాటం వెలుగులోకి వస్తోంది. గెలుపు ఓటములను రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ప్రచారంలో పోటీపడ్డాయి. చివరకు తాయిలాలు పంపిణీలోను తమది పైచేయిగా వుంటే గెలుపు సునాయాసమని భావించారు. దానికి తగ్గట్టుగానే పంపిణీల్లో పోటీపడ్డారు. ప్రతి ఓటరుకు అందే విధంగా కేడర్‌కు డబ్బులు ముట్టజెప్పారు. కొంతమంది కేడర్ చేతివాటాన్ని ప్రదర్శించారు. ఓటర్లకు ఇవ్వకుండానే జాబితాల్లో టిక్కులు కొట్టారు. పోలింగ్ బిజీలో నిమగ్నమైన నాయకులు ఆ సమయంలో పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తమ వార్డులో పూర్తిగా డబ్బులు అందలేదని, కొంత మందికి ఇచ్చి మిగిలింది బొక్కేసారని అభ్యర్థులకు ఫిర్యాదు చేస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. పంపిణీ సమయంలో ఇంట్లో ఆరు ఓట్లు ఉండి ఇద్దరు లేకపోతే నలుగురికి ఇచ్చారు. మిగిలిని ఇద్దరికి ఇచ్చినట్టు టిక్కులు పెట్టారు. తాయిలాలు తీసుకోవడానికి కొంతమంది తిరస్కరించారు. దీనికి కూడా ఓటర్లకు డబ్బులు ఇచ్చేశామంటూ నాయకులు లెక్కలు చూపారు. ఇవన్నీ బయటకు వస్తున్నాయి. దీంతో పార్టీలకు రెండు రోజులుగా ఈ వ్యవహారం పెద్దగా తలనొప్పిగా మారింది. పోలింగ్ ముందురోజు ఈ తరహా ఆరోపణలు వినిపించాయి ఆ సమయంలో వాటిని అభ్యర్థులు సరిచేశారు. కొన్ని బయటపడలేదు. ఇప్పుడు వెలుగు



చూస్తుండడంతో అక్కడ పంపిణీ చేసిన వారిని పిలిచి అభ్యర్థులు ఆరాతీశారు. ఈ తరహా నొక్కుళ్లు ఎక్కువగా అర్బన్ ఏరియాల్లోను, అక్కడక్కడా గ్రామీణ ప్రాంతాల్లోనూ జరిగాయి. నర్సాపురం నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల్లోనూ ఈ తరహా నొక్కుళ్లు ఉన్నాయి. తొలుత అభ్యర్థులు సరిచేశారు. అయినా పెద్ద మొత్తంలో బయటపడడంతో అభ్యర్థులు అవాక్కవుతున్నారు. పార్టీలో ఉంటూ గెలిపించాల్సిన కేడర్ ఈ తరహా నొక్కుళ్లకు పాల్పడడంపై అభ్యర్థులు మండి పడుతున్నారు. నర్సాపురంలోని పట్టణ శివారులోని ఓ కాలనీలో అధికార పార్టీకి చెందిన నాయకులు పెద్ద మొత్తంలోనే నొక్కేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడే ఏకంగా రూ.5.50 లక్షలు జేబులు పెట్టుకున్నారంటూ అంతా కోడై కూస్తున్నారు. తణుకులో ఇటువంటి బాపతు అధికంగానే ఉంది. కొన్ని ప్రాంతాల్లో అసలు పంపిణీ జరగలేదు.

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్

- 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ, 18 నుంచి 23 వరకు ఇంజనీరింగ్ పరీక్ష
- భీమవరం, తాడేపల్లిగూడెం, నర్సాపురంలో పరీక్ష కేంద్రాలు
- అగ్రికల్చర్, ఫార్మసీకి 4,087, ఇంజనీరింగ్ 9,928 విద్యార్థులు

భీమవరం ఎడ్యుకేషన్, మే 15 : ఏపీఈఏపీ సెట్-2024 పరీక్షలు గురువారం నుంచి మొదలు కానున్నాయి. 16, 17 తేదీలలో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష, 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ పరీక్ష జరగనుంది. భీమవరంలో నాలుగు పరీక్ష కేంద్రాలు, తాడేపల్లిగూడెంలో రెండు, నర్సాపురంలో ఒక కేంద్రంలో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 4,087 మంది, ఇంజనీరింగ్ పరీక్షకు 9,928 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం సెషన్‌లో తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వరకు రెండో సెషన్‌లోను పరీక్షలు జరుగుతాయి. పరీక్ష సమయానికి గంట ముందు నుంచి పరీక్ష హాలులోకి పంపిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ వంటి ఎలక్ట్రికల్ వస్తువులు తీసుకువెళ్లనివ్వరు. పరీక్ష కేంద్రాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు పరీక్ష కేంద్రాల కో ఆర్డినేటర్లు తెలిపారు.

కొన్ని రైళ్లు రద్దు..
మరికొన్ని పొడిగింపు -7లో..

డయేరియా విజృంభణ

ఒకరి మృతి.. 8 మందికి అస్వస్థత

కుక్కునూరు, మే 15 : దామరచర్ల పంచాయతీ కురుములతోగు ఆది వాసి గ్రామంలో డయేరియా ప్రబలింది. బుధవారం గ్రామానికి చెందిన దారం బుజ్జమ్మ(65) మృతి చెందింది. మరో ఎనిమిది మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు బాచిన సత్యనారాయణకు తెలియడంతో ఆయన మీడియాకు సమాచారం అందించారు. వైద్య సిబ్బంది అప్రమత్తమై గ్రామానికి వెళ్లి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించారు. ఆరేళ్ళ మడకం దేవయ్య, ఆరు నెలల చిన్నారులు కల్లూరి శాంతి, మడియం సంజన, కూనం మంగయ్య, వెట్టి లక్ష్మి, పొడియం యర్రమ్మలకు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. మూడు రోజుల క్రితం గ్రామంలో వర్షం కురిసింది. వారంతా వాగుపక్కనే ఉన్న ఓ బావిలో ఉన్న నీటిని తాగునీటిగా వాడుకుంటున్నారు. వర్షపు నీరు ఆ బావిలోకి వెళ్లగా ఆ నీటినే తాగునీటిగా ఉపయోగించడంతో గ్రామస్థులు అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం నుంచి వాంతులు, వీరేచనాలతో బాధపడుతూ బుజ్జమ్మ మృతి చెందినట్టు ఆదివాసీలు తెలిపారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ గ్రామంలో పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టారు. తాగు నీటి సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. బావిలో నీరు తాగవద్దని ఆదేశాలు జారీచేశారు. అమరవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనంత్ మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం ఒకరిని ప్రభుత్వాసుపత్రికి తరలించామని మిగిలిన వారిని గ్రామంలోనే ఉంచి వైద్యం చేస్తున్నామన్నారు. పరిస్థితి అదుపులో ఉందని తెలిపారు. 25 ఏళ్ల క్రితం చత్తీస్‌ఘడ్ ప్రాంతం నుంచి ఆదివాసీలు వలస వచ్చి కురుములతోగు గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాన రహదారికి మూడు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఈ గ్రామం ఉంది. రిజర్వ్ ఫారెస్ట్ కారణంగా ఆ గ్రామానికి రహదారి, విద్యుత్ సౌకర్యం, మంచినీటి బోరు తదితర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ గ్రామస్థులు సౌకర్యాలు లేక మగ్గిపోతున్నారు. వాగు నీరు, బావిలోని నీరు తాగునీటిగా ఉపయోగించుకోవడంతో తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. రెండేళ్ల క్రితం ఇదే పరిస్థితి తలెత్తి దాదాపు 20 మంది వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. మౌలిక వసతులు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.



అనారోగ్యంతో వున్న ఆదివాసీలు



ఆదివాసి గ్రామం కురుములతోగు

గో'దారి' ఎటువైపు..!



- అందరి కళ్లు గోదావరి జిల్లాల మీదే
- ఇక్కడ మెజార్టీ వస్తే రాష్ట్రంలో అధికారం వచ్చినట్టే
- జోరుగా సాగే పందేల్లో ఇదే పరమార్థం
- గెలుపు, ఓటమిలపై వెనక్కి తగ్గని కూటమి, వైసీపీ
- పాత సెంటిమెంట్లు పునరావృతం కాగలవని ఆశలు



ఏలూరు, ఆంధ్రజ్యోతి (ప్రతినిధి)

సార్వత్రిక ఎన్నికలు వచ్చాయంటే రాష్ట్రప్రజల దృష్టి అంతా గోదావరి జిల్లాల వైపే ఉంటుంది. ఇక్కడ ఓటర్లు ఏ వైపు మొగ్గు చూపుతారో ఆ పార్టీనే అధికార పగ్గాలు అందుకోవడం ఖాయం. ఇప్పుడు జరిగిన ప్రతిష్ఠాత్మక పోరులో కూటమి ఓ వైపు, వైసీపీ ఇంకోవైపు మోహరించి ఎన్నికల యుద్ధం చేశాయి. అత్యంత కీలకమైన సామాజికవర్గాల పక్షాన జనసేనతో కలిసి టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడి, వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆఖరికి మంత్రులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లోనూ సైలెంట్ ఓటింగ్ ఎవరి కొంప ముంచుతుందో తెలియక విలవిల్లాడుతున్నారు. గోదావరి జిల్లాల్లో రాజకీయక్షేత్రంలో జనసేన పాత్ర ఈసారి అత్యంత కీలకంగా మారింది. బీజేపీ కూడా జత కలవడంతో ధీమాగా ముందుకు సాగారు. అధికార వైసీపీ సైతం కూటమిని ఢీకొట్టేందుకు సర్వశక్తులు ఒడ్డింది. ఆర్థిక సామాజిక వర్గాలను టార్గెట్ చేసి ఎత్తుగడలు వేసింది. గ్లాస్ జోరందుకోకుండా సైకిల్ స్పీడ్ అందుకోకుండా అడ్డుకట్ట వేసేందుకు విఫలయత్నం చేసింది. ఈ క్రమంలోనే ఇప్పుడు ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలో ఎవరు బలం ఎంత ? 2014 నాటి ఫలితాలే పునరావృతం అవుతాయా? లేదా? అనేదే ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ..



అప్పుడు..ఇప్పుడు అంతే

2014 నాటి ఎన్నికలు, పోలింగ్ సారూప్యత ఈ ఎన్నికల్లోనూ కనిపిస్తోంది. అప్పట్లో తెలుగుదేశం, బీజేపీ పొత్తును ఓటర్లు స్వాగతించారు. అనూహ్యంగా జగన్ పార్టీని వెనక్కి నెట్టారు.ఒకానొక దశలో ఈ కూటమిని ఢీకొనేందుకు ఎన్ని ఎత్తుగడలు వేసినా అది ఫలించనే లేదు. ఆది నుంచి తెలుగుదేశం వివిధ పార్టీలతో ఎన్నికల పొత్తుకు దిగుతూనే ఉంది. వీటిలో కొన్నిసార్లు అధికారపగ్గాలు చేజిక్కించుకోవడం, టీడీపీకి సాధ్యమైంది. కాని 2019లో మాత్రం ఒంటరిగా రంగంలోకి దిగిన టీడీపీ తీవ్ర నష్టాన్నే చవిచూసింది. అప్పుడు జరిగిన చేదు అనుభవంతో ఈసారి రణక్షేత్రంలోకి దిగే ముందే వ్యూహాత్మకంగా టీడీపీ ఆచితూచి వ్యవహరించింది. జనసేన చేయి అందుకుని ఆ వెనువెంటనే కమలం భుజం తట్టి పోరుకు సిద్ధమైంది. ఈ కూటమిపక్షాన సీట్లు సర్దుబాటు ఒకానొక దశలో కష్టతరంగా మారినా అందులో ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో పార్టీ ఐడెంటిటీ పొత్తు కారణంగా దెబ్బతింటుందని, ఎక్కువ నియోజకవర్గాలు జనసేనకు కాని, బీజేపీకి కాని వదిలేయవద్దంటూ తెలుగుదేశంలో సీనియర్లు పార్టీపై ఒత్తిడి తెచ్చారు. కాని ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా వైసీపీని సాగనంపటానికి తెలుగుదేశం కూడా గోదారి ఒడ్డున త్యాగాలకు ఓర్చింది. తెలుగుదేశం అత్యంత కీలకంగా భావించే స్థానాలను కూడా పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. ఆఖరికి ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును సైతం ఒప్పించి ఉంగుటూరు నియోజకవర్గాన్ని జనసేన చేతిలో పెట్టింది. ఈ పరిణామాలు ఓటర్లలో పరస్పర చర్చకు దారితీశాయి. గోదావరి జిల్లాలు అంటేనే తెలుగుదేశం పార్టీకి ఊపిరి. ఈ జిల్లాలో వచ్చిన మెజార్టీతోనే ప్రతిసారి అధికారపగ్గాలు చేజిక్కించు కోవ డానికి తెలుగుదేశానికి ఓ అదృష్టంగా ఉండేది. అలాంటిది ఈసారి జిల్లాలో సగానికి సగం స్థానాల్లో మిత్రపక్షాలైన జనసే, బీజేపీకి కేటాయిం చింది.

ఎవరెకి ఎన్ని.. ? అంతటా ఇదే ఆరా

గోదారి జిల్లాల్లో పోలింగ్ ముగిసిన వెంటనే బెట్టింగ్‌లకు దిగడం ఆనవాయితీ. ఈ బెట్టింగ్‌లే పార్టీ అభ్యర్థుల విజయ అవకాశాలను కాస్త దగ్గరగా ఉండేలా చేస్తాయి. ఈసారి జరిగిన ఎన్నికల్లో అత్యంత కీలకం కావడం ఒక ఎత్తు అయితే కూటమి పక్షాన నిలబడిన అభ్యర్థులు వైసీపీకి నేరుగా సవాళ్ళు విసిరారు. ఈ క్రమంలో ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటరీ స్థానాలు ఉండగా వీటిలో మెజార్టీ కూటమి గెలుచుకోగలదని, 2014 నాటి ఫలితాలు పునరావృతం కావడం ఖాయమని జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. భీమవరం కేంద్రంగా సాగే బెట్టింగ్‌ల్లో నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో ఏడుకు ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు లోక్‌సభ స్థానం కూటమి కైవశం చేసుకోగలదనే దిశగానే వెళుతున్నాయి. మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్య నారాయణల ఓటమి ఖాయమని కొందరు పందేలు కాస్తున్నారు. 2014 లోనూ ఈ తరహాలోనే బెట్టింగ్‌లు సాగిన దిశగానే ఫలితాలు కూడా వెలువడ్డాయి. 2014 ఎన్నికల్లో కూటమిపక్షాన నరేంద్ర మోదీ భీమవరం వచ్చారు. ఇప్పుడు ఇదే నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌లు పర్యటించడం సెంటుమెంట్‌గా భావిస్తున్నారు. బీజేపీ అగ్రనేతలు ప్రచారానికి రావడం తమ విజయ అవకాశాలకు పెంచడమేనని ఇక్కడి నేతలు భావిస్తారు. ఏలూరు లోక్‌సభ స్థానంలో పుట్టా మహేష్, నరసాపురం లోక్‌సభ స్థానంలో శ్రీనివాస్‌వర్మ గెలుపుపైన 14 అసెంబ్లీ నియోజకవర్గాలను స్వీప్ చేస్తారని కొందరు బెట్టింగ్‌లకు దిగగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 9 నుంచి 11 కూటమికి 4 స్థానాలు వైసీపీకి దక్కుతాయని, ఇంకొందరు ఓ అంచనాకు వచ్చారు.

అంతా ఒక్కటై.. కలిసిమెలిసి

గోదావరి జిల్లాల్లో ఏ పార్టీకి ఆపార్టీ తన మద్దతుదారులను కూడకట్టుకుని తనదే పైచేయి కావాలని ప్రతిసారి కోరుకుంటూ వస్తూనే పొత్తుకు దిగటం, అదేరీతిలో దీటుగా గెలుపొందటం జరుగుతూ వచ్చింది. గత ఎన్నికల్లోనూ జనసేన ఒంటరిగా పోటీ చేసినప్పుడు చింతలపూడి, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, ఉండి, నరసాపురం, తణుకు వంటి నియోజకవర్గాల్లో తనదైన బలం చూపింది. ఆఖరికి నిడదవోలులోనూ సత్తాచాటే ప్రయత్నం చేసింది. అప్పట్లో జనసేనకు ఈ నియోజకవర్గాలు అన్నింటిలోనూ ఐదెంకెల మేర ఓట్లు లభించాయి. అంటే ఒంటరిగా పోటీ చేసినా సొంత బలం ఉన్న పార్టీగా జనసేన గోదావరి జిల్లాలో తనదంటూ ఒక ముద్ర వేసింది. అప్పటికి ఇప్పటికి తేడా ఏంటంటే ఉమ్మడిగా ఉన్నందున ఇది అన్నదమ్ముల అనుబంధమని, ఇప్పటి కూటమిన అటు జనసేన కార్యకర్తలు, ఇటు బీజేపీ కార్యకర్తలతో పాటు టీడీపీ ఉమ్మడిగా అభ్యర్థుల వెంటే ఉన్నారు. ప్రచారంలోనూ, వ్యూహాల్లోనూ కలిసి నడిచారు. విభేదానికి తావులేకుండా చీలికలకు తావులేకుండా వ్యవహరించి పోలింగ్‌కు ముందే జనామోదం పొందారు. దీంతో ఓటర్లలోనూ కూటమి తన సానుకూలతను రెండింతలు చేసుకోగలిగింది. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన పోలవరం లోనూ తన పార్టీ అభ్యర్థిగా చిర్రిబాలరాజును రంగంలోకి దింపటం ఆర్థికంగా కాస్త వెనుకబడిన అభ్యర్థి అయినప్పటికి తెలుగుదేశం ఏ మాత్రం వెనుకంజ వేయకుండా భుజం కాచింది. ఇదంతా ఉమ్మడి జిల్లాలో 15 నియోజకవర్గాల్లోనూ కూటమిలో నేతలు, కార్యకర్తలు ఒకేమాట, ఒకే ఓటు అనే రీతిలో విజయానికి చేరువయ్యే క్రమానికి చేర్చగలిగిందని విశ్లేసిస్తున్నారు.ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో కైకలూరు నియోజక వర్గంలో ఉన్న జనసైనికులు ఈసారి ఎన్నికల్లో కీలకంగా నిలిచారు. ఎలాంటి అరమరికలు లేకుండా బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని వెంటే పరుగులు తీశారు. నరసాపురంలో జనసేన అభ్యర్థికి పార్టీ టీడీపీ సీని యర్లు, బీజేపీలో అనుకూలురు పూర్తిస్థాయిలో ఐక్యంగా నిలిచి ముందుకు నడిపించారు.

కొన్ని రైళ్లు రద్దు..మరికొన్ని పొడిగింపు



నరసాపురం, ఏలూరు క్రైం, మే 15: విజయవాడ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొన్ని రైల్వే ట్రాక్‌లు మరమ్మతుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేశారు. వేసవికాలంలో ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా 20 రైళ్లను పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 12 రైళ్ళను ఈనెల 15వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ రద్దు చేశారు. గురువారం నుంచి ఈనెల 26 వరకు పలు డెమో రైళ్లను రద్దు చేస్తూ దక్షణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలో 07897 ఉదయం 3.25కి నెంబర్‌తో ఉదయం 3.25కు నరసాపురంలో బయలుదేరి నిడదవోలు వెళ్లే డెమో, 07771 నెంబర్‌తో నిడదవోలు నుంచి ఉదయం 6.45కి నరసాపురం వచ్చే డెమో, 17270 నెంబర్‌తో ఉదయం 9.45కు నరసాపురం, విజయవాడ వెళ్లే డెమో,07862 నెంబర్‌తో విజయవాడలో మధ్యాహ్నం 2.20కు నరసాపురం వచ్చే డెమో, 07883 నెంబర్‌తో రాత్రి 8.10కి నరసాపురం నిడదోదలు వెళ్లే డెమో, ఉదయం 5.15కి 07884 నెంబర్‌తో నిడదదోలు- భీమవరం మధ్య నడిచే డెమో రైళ్లు ఉన్నాయి. అలాగే 07466 నెంబర్‌తో రాజమండ్రి- విశాఖపట్టణం, 07467 నంబర్‌తో విశాఖపట్టణం నుంచి రాజమండ్రి 22701 నెంబరుతో విశాఖ పట్టణం -గుంటూరు,22702 నంబర్‌తో గుంటూరు-విశాఖపట్టణం, 17239 నంబర్‌తో గుంటూరు - విశాఖపట్టణం నడిచే రైళ్లను రద్దు చేశారు

పొడిగించిన రైళ్లు :

06071 ఎర్నాకుళం-నిజాముద్దీన్ (శుక్రవారం) జూన్ 7 నుంచి జూన్ 28 వరకూ
06072 నిజాముద్దీన్-ఎర్నాకుళం (సోమవారం) జూన్ 10 నుంచి జూలై 1 వరకూ
06073 చెన్నై- భువనేశ్వర్ (సోమవారం) జూన్ 10 నుంచి జూలై 1 వరకూ
06074 భువనేశ్వర్ - చెన్నై (మంగళవారం) జూన్ 11 నుంచి జూలై 2 వరకూ
06077 చెన్నై ఎగ్మోర్ -సత్రగంజి (శనివారం) జూన్ 1 నుంచి జూన్ 29 వరకూ
06078 సత్రగంజి- చెన్నై ఎగ్మోర్ (సోమవారం) జూన్ 3 నుంచి జులై 1 వరకూ
06079చెన్నై ఎగ్మోర్-సత్రగంజి (మంగళవారం)జూన్ 4 నుంచి జూలై 2 వరకూ
06080 సత్రగంజి - చెన్నై ఎగ్మోర్ (బుధవారం)జూన్ 5 నుంచి జూలై 3 వరకూ
06081 కొచ్చివెల్లి - షాలిమర్ (శుక్రవారం) జూన్ 7 నుంచి 28 వరకూ
06082 షాలిమర్ - కొచ్చివెల్లి (సోమవారం) జూన్ 10 నుంచి జూలై 1 వరకూ
06089 తాంబ్రం - సత్రగంజి (బుధవారం) జూన్ 5 నుంచి జూలై 3 వరకూ
06090 సత్రగంజి - తాంబ్రం (గురువారం) జూన్ 6 నుంచి జూలై 4 వరకూ
06095 తాంబ్రం - సత్రగంజి (గురువారం) జూన్ 6 నుంచి జూలై 4 వరకూ
06096 సత్రగంజి - తాంబ్రం (శుక్రవారం) జూన్ 7 నుంచి జూలై 5 వరకూ
06103 నాగర్ కోయల్- డిబ్రూగర్ (శుక్రవారం) జూన్ 7 నుంచి జూన్ 21 వరకూ
06104 డిబ్రూగర్-నాగర్‌కోయల్ (బుధవారం) జూన్ 12 నుంచి జూన్ 26 వరకూ
06105 నాగర్‌కోయర్ -డిబ్రూగర్ (శుక్రవారం) జూన్ 14 నుంచి జూన్ 28 వరకూ
06150 డిబ్రూగర్ -నాగర్‌కోయల్ (బుధవారం) జూన్ 19 నుంచి జులై 3 వరకూ
06181 కోయంబత్తూర్-భగత్‌కీకుట్టీ (గురువారం)మే 30 నుంచి జూన్ 27 వరకూ
06182 భగత్‌కీకుట్టీ-కొయ్యంబత్తూర్ (ఆదివారం)జూన్ 2 నుంచి జూన్ 30వరకూ

నిట్‌లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఉచిత శిక్షణ

తాడేపల్లిగూడెం అర్బన్, మే, 15 : ఏపీ నిట్‌లో వచ్చేనెల 3వ తేదీ నుంచి 7 వరకు 8,9,10 తరగతి విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ కార్తికేయశర్మ తెలిపారు. సంస్థలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకూ శిక్షణా ఉంటుందన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99854 57227, 90101 01065 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

21న భీమవరంలో క్రికెట్ ఎంపిక పోటీలు

ఏలూరు స్పోర్ట్స్, మే 15:పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ -15, 19, 23 ఏళ్ల బాలికల సీనియర్ క్రికెట్ ఎంపిక పోటీలు ఈనెల 21న భీమవరం, డీఎన్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు అసోసి యేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సొంత కిట్ కలిగి 21న ఉదయం 9 గంటలకల్లా హాజరుకావాలని తెలి పారు. క్రీడాకారులు 2009, 9వ నెల 1వ తేదీలోపు 15 ఏళ్ల పూర్తి అయిన వారు, అలాగే 2011, 8వ నెల 31వ తేదీకి 19 ఏళ్ల, 2005, 9వ నెల,1వ తేదీకి 23 ఏళ్ల పూర్తయిన వారు అర్హులన్నారు. ప్లేయర్స్ పుట్టిన తేదీ జిరాక్స్ కాపీలు, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ల కోసం 25 వేల దరఖాస్తులు

నూజివీడు టౌన్, మే 15: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ల కోసం అభ్యర్థుల నుంచి ఇప్పటివరకు 25 వేల దరఖాస్తులు దాఖలైనట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కంట్రోలర్ గోపాలరాజు తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలో నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ) క్యాంపస్‌లలో నాలుగు వేల సాధారణ సీట్లు మరో 400 సూపర్ న్యూమనరీ సీట్లకు ఈనెల 8వ తేదీ ఆర్జీయూకేటీ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. ఈనెల 25వ తేదీవరకు 10వ తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని వెల్లడించింది. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన మొదటివారం రోజుల్లో నాలుగు క్యాంపస్‌లలోనూ అడ్మిషన్ల కోసం 25 వేల దరఖాస్తులు దాఖలైనట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో జూన్ 24 నుంచి 28 వరకు బ్లాక్‌చైన్ టెక్నాలజీపై ఎఫ్‌డీపీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాశాల సభ్యులు

భీమవరం ఎడ్యుకేషన్, మే 15 : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 24 నుంచి 28 వరకు జాతీయస్థాయిలో సైబర్ సెక్యూరిటీ బ్లాక్ చైన్ టెక్నాలజీపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహి స్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను కళాశాల డైరెక్టర్ జగపతిరాజు బుధవారం కళాశాలలో విడుదల చేశారు. ప్రోగ్రాం కన్వీనర్ కృష్ణం రాజు మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఎఫ్‌డీపీలో నూతన టెక్నాలజీపై ఫ్యాకల్టీకి అవగాహన కల్పిస్తారన్నారు. దీనిని అందరూ సద్వినియోగం చేసు కోవాలన్నారు. కోఆర్డినేటర్స్ డాక్టర్ రవికిరణ్‌వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కవిత వ్యవహరిస్తున్నారు. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణమయ పథకానికి 57.580 గ్రాముల బంగారం



ద్వారకాతిరుమల, మే 15: శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకానికి కాళ్ల మండలం పెదఅమిరానికి చెందిన చంద్రశేఖర్ బుధవారం 57.580 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఏఈవో మెట్టపల్లి దుర్గారావు విరాళం రసీదు అందించారు. దీని విలువ సుమారు రూ.4 లక్షల వరకూ ఉంటుందని అధికారులు చెప్పారు.

పెదమల్లం మాచేనమ్మ జాతర ప్రారంభం

ఆచంట, మే 15 : పెదమల్లం మాచేనమ్మ శ్రీపల్లాలమ్మ అమ్మవార్ల జాతర మంగళవారం రాత్రి ప్రారంభమైంది. అమ్మవార్ల జాతర నిప్పులగుండం కార్యక్రమాలు వచ్చేనెల 3,4 తేదీలలో నిర్వహిస్తామని ఈవో రాము తెలిపారు. అమ్మవార్లను మంగళవారం రాత్రి నిలబెట్టి జాతర పూర్తయ్యేవరకు ప్రతీరోజూ గరగలతో సాయంత్రం ఇంటింటికి తిప్పుతారు. సుమారు 20 రోజుల పాటు ప్రతీరోజూ గ్రామంలో అమ్మవారిని ఊరేగిస్తారు.

18 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

22 రాత్రి స్వామివారి కల్యాణం

18 నుంచి 25 వరకూ ఆర్జిత సేవలు రద్దు



విద్యుద్దీపాలంకరణ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల, మే 15: ద్వారకాతిరుమల చిన్న తిరుమలేశుని వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 25 వరకూ వైఖానస ఆగమ యుక్తంగా జరుగనున్నాయి. దీనికోసం ఆలయ పరిసరాలలో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. పాత కల్యాణ మండపం ముందు శ్రీవారు, అమ్మవార్ల భారీవిద్యుత్ కటౌట్ ఏర్పాటుకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి. ఆలయ గోపురాలకు ఇప్పటికే విద్యుత్ తోరణాలను అమర్చారు. పాదుకా మండపం వద్ద, శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం ముందు తాటిఆకుల పందిర్లను నిర్మిం చారు.బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 25 వరకు నిత్యార్జిత కల్యా ణా లను, ఆర్జితసేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి, అమ్మ వార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా చేస్తారు. 19న ధ్వజారోహణ, 21న ఎదుర్కోలు ఉత్సవం, 22న రాత్రి 8-30 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 23న రాత్రి 7-30 గంటలకు రథోత్సవం, 24న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజ అవరోహణ, 25న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం,రాత్రి జరిగే ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.




స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులు.., ధ్వజస్తంభం వద్ద నిర్మించిన తాటాకు పందిరి

మొక్క..మాను అవుతోంది సామీ..

గోపురాలపై పిచ్చిమొక్కలు

మొక్కే కదా అని వదిలేస్తే.. అది మాను అవుతోంది. శ్రీవారి ఆలయ ప్రధాన రాజ గోపురాలపై పిచ్చి మొక్కలు పెరుగుతున్నా అధికారులు వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదు. మరో రెండు రోజుల్లో రానున్న బ్రహ్మోత్సవాల నిమిత్తం గోపురాల చుట్టూ విద్యుత్ తోరణాలను అమర్చిన అధికారులకు ఈ పిచ్చిమొక్కలు కనిపించక పోవడం శోచనీయం. ఏళ్ల తరబడి ఆలయ గోపురాలపై పెరుగుతున్న పిచ్చిమొక్కల కారణంగా శిల్ప సౌందర్యాలు కళా విహీనం కాగా గోపురాలు దెబ్బతినే ప్రమాదం పొంది ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.





శ్రీవారి రాజగోపురంపై పెరుగుతున్న మొక్కలు

విద్యార్థుల హృదయాల్లో మా'స్టార్'

22 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో అందరి మన్ననలు



భవానీ శంకర ప్రసాద్

పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు, మే 15 : విద్యార్థుల్లో చైతన్య దీపాలు వెలిగిస్తూ తన జీవితాన్ని జీతాన్ని విద్యార్థులకే వినియోగిస్తున్న పాలకొల్లు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడి జీవితం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుడిదే అని భావించి వారికోసం పరిశ్రమిస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడుగా పేరు తెచ్చున్నారు పాలకొల్లు వీవర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్న రాయపూడి భవానీ శంకర ప్రసాద్. పాలకొల్లు మున్సిపల్ టీచర్‌గా 2000 సంవత్సరం నుంచి పనిచేస్తున్నారు. తాను పనిచేసే పాఠశాల అభివృద్ధికి దాతల సహకారంతో విద్యార్థులకు విద్యాసామాగ్రిని సమకూర్చడమే కాకుండా పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్, మౌలిక సదుపాయాల కల్పించేందుకు కృషి చేశారు. 22వ వార్డులోని కొత్తపేట స్పెషల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థలో ఉన్న సమయంలో హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన భవానీ ప్రసాద్ పలు సేవా సంస్థలను, దాతలను ఆశ్రయించి, సుమారు రూ.7లక్షలతో పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తన సొంత ఖర్చుతో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తుంటారు. పాఠశాలలో 2వ తరగతి విద్యార్థికి గుండె ఆపరేషన్ కోసం దాతల సహకారంతో సుమారు రూ.53 వేలు సేకరించి అందించారు. దాతల సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యాసామాగ్రిని అందించడంతో పాటు పాఠశాలకు డైలీ న్యూస్ పేపర్లు వచ్చే విధంగా చేసి ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ విద్యార్థి బాగా చదవాలి అనేది ఆయన లక్ష్యం. ఆయన ఏ పాఠశాలకు వెళ్ళినా ఆ స్కూల్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. అందుకే ఆయన విద్యార్థులకు మా'స్టార్'గా నిలిచారు..



దాతల సాయంతో సమకూర్చిన ఆట వస్తువులు,విద్యాసామాగ్రితో విద్యార్థులు (ఫైల్)

క్రైం వార్తలు

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, మే 15 : ఎన్నికలు జరిగిన సమయంలో సైకిల్‌పై చక్కెర్లు కొట్టాడని కక్ష పెంచుకుని కొంతమంది వ్యక్తులు అకస్మాత్తుగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో వారందరిపై కేసు నమోదు చేసిన టూటౌన్ సీఐ ప్రభాకర్ బుధవారం మధ్యాహ్నం వారిలో ముగ్గురిని అరెస్టు చేశారు.ఏలూరు కొత్తపేటకు చెందిన చీపుర్ల గణేష్ (25) పూలకొట్టులో పనిచేస్తూ ఉంటాడు. ఈనెల 13వ తేదీన ఎన్నికలు జరిగిన రోజున సైకిల్ వేసుకుని తిరిగాడు. 14వ తేదీ రాత్రి కొంతమంది అతని ఇంటికి వచ్చి గణేష్ ఉన్నాడా అని అడిగి వెళ్ళిపోయారు. రాత్రి తన స్నేహితులతో కలిసి కొత్తపేట ఏటిగట్టు ప్రాంతంలో టిఫిన్‌కు వెళ్తుండగా రాళ్ళతో గణేష్‌పై దాడి చేశారు. ఎవరు అని ప్రశ్నించేలోపు అదే ప్రాంతానికి చెందిన వీర లీలా కుమార్, బోగా అనిల్, బత్తుల సతీష్ మరికొంతమంది కలిసి అతనిపై దాడి చేసి మెడపై బలమైన వస్తువుతో కోశారు. గాయాలపాలైన బాధితుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వారిలో ముగ్గురిని అరెస్టు చేశారు. వారిని కోర్టుకు హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.

డివైడర్ ఢీకొని ఒకరు మృతి



అన్నవరం (ఫైల్)

తణుకు, మే 15 : తణుకు బైపాసు బెల్లం మార్కెట్ సమీపంలోని ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన ఈతకోట అన్నవరం (41) బుధవారం ద్విచక్ర వాహనంపై తణుకు వస్తుండగా డివైడర్‌ను ఢీకొట్టి పడి పోయాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో 108లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు తాపీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అన్నవరం తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినమల్లంలో వివాహిత ఆత్మహత్య

పెనుగొండ, మే 15: పెనుగొండ మండలం చినమల్లం గ్రామంలో బీచ్‌కు తీసుకు వెళ్లలేదని మనస్థాపంతో ఒక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పెనుగొండ ఎస్ఐ షేక్ సుభాణి తెలిపిన వివరాల ప్రకారం చోడగిరి మనీషా (29) చినమల్లం గ్రామంలో 11 నెలలుగా భర్తతో కలిసి ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. భర్త హరికృష్ణ బుధవారం పేరుపాలెం బీచ్‌కు తీసుకెళతానని భార్య, పిల్లలకు చెప్పాడు. భర్త ఇంటికి వచ్చేసరికి ఆలస్యం అయింది. వచ్చిన తరువాత బయలుదేరమని అడగగా భార్య రానని కోపంతో ఇంటి దగ్గరే ఉండిపోయింది. తన ఇద్దరు కుమార్తెలతో బీచ్‌కు వెళుతుండగా మార్గమధ్యలో ఫోన్ రావడంతో తిరిగి వచ్చాడు. భార్య ఉరి వేసుకుని చనిపోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. పోస్టు మార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కొవ్వూరు రూరల్ ఎస్ఐ



మృతుడు చుక్క బాలాజి (ఫైల్)

గోదావరిలో మునిగి విద్యార్థి మృతి

కొవ్వూరు, మే 15 : గోదావరి నదిలో స్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు నదీలో మునిగి విదార్థి మృతి చెందినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. సుధాకర్ తెలిపారు.పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన చుక్క బాలాజి (24) ఏఎస్ఆర్ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం తన స్నేహితులు సమెల్లి సంతోష్‌కుమార్, దత్తు రోహిత్ రామసూర్యలతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం సీతంపేట గ్రామంలోని విజ్జేశ్వరం బ్యారేజ్ 36వ గేట్ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. నది లోతును గమనించకుండా గోదావరిలో దిగడంతో ప్రమాదవశాత్తూ కాలుజారి నదిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వేసవిలో విజ్జేశ్వరం ఆనకట్ట వద్ద గోదావరి నదీ స్నానాలకు దిగరాదని కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.సుధాకర్ హెచ్చరించారు. అఖండ గోదావరిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం బ్యారేజ్ ఆనకట్ట వద్ద గోదావరి నది ఎక్కువగా ఉందన్నారు. ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలు గోదావరి నదిలో స్నానాలు చేయడానికి వచ్చి మృత్యువాత పడుతున్నారు. ఆనకట్ట వెంబడి స్నానాలు చేయడానికి ప్రమాదభరితంగా ఉన్నందున ప్రజలు, విద్యార్థులు, పర్యాటకులు వచ్చి నదిలో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

ఎన్నికల విధుల నుంచి వస్తుండగా ప్రమాదం

బైక్‌పై నుంచి పడి ఉపాధ్యాయుడికి గాయాలు

పాలకొల్లు అర్బన్, మే 15 : ఎన్నికల విధులు పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలైనట్లు ఆలస్యంగా తెలిసింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, నరసాపురానికి చెందిన ఎం.మార్కండేయులు భీమవరంలో మూడు రోజులు ఎన్నికల విధులు పూర్తి చేసుకుని మంగళవారం నరసాపురానికి స్కూటీపై వస్తుండగా వీరవాసరం మురుగు కాలువ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డుపక్క చేలల్లో పడిపోయాడు. వెనుక వైపు నుంచి వస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు చూసి ఆయనను 108 వాహనంలో పాలకొల్లులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 36 గంటలకు పైగా డ్యూటీ చేసి రావడంవల్ల తీవ్ర అలసటకు గురై ఉండవచ్చని యూటీఎఫ్ నాయకులు తెలిపారు ప్రస్తుతం అతడు కోలుకుంటున్నట్టు యూటీఎఫ్ నాయకులు జి.లక్ష్మీనారాయణ, యు.పెద్దిరాజు తదితరులు తెలిపారు.

ప్రజా ప్రభుత్వంలో అందరికి న్యాయం

మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



ఆరిమిల్లిని పుష్పగుచ్ఛాలతో అభినందిస్తున్న కార్యకర్తలు, అభిమానులు

తణుకు, మే 15: రానున్న ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం తణుకు పట్టణం, రూరల్, ఇరగవరం, అత్తిలి మండలాల పరిధిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున టీడీపీ కార్యాలయానికి విచ్చేసి ఆరిమిల్లిని పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ ఎన్నికల్లో అందరూ కష్టపడి పనిచేశారని, రాత్రి పదకొండు గంటలకు కూడా ఓటర్లు నిలబడి ఓటేశారంటే వారిలో కసికి ఇది నిదర్శనమన్నారు. వైసీపీ దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారని వివరించారు. రానున్న ప్రజా ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



సూత్ర ఎగ్జిబిషన్‌లో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మహిళలు

ఆనందా ఇన్‌లో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం

భీమవరంటౌన్, మే 14 : భీమవరం ఆనంద ఇన్‌లో బుధవారం నుంచి సూత్ర ఎగ్జిబిషన్ ప్రదర్శనను ప్రారంభమైంది. రెండు రోజులపాటు సూత్ర అనేది ఒక ఎగ్జిబిషన్ ఫ్యాషన్ హౌస్ కొనసాగుతుది. దేశంలోని టైర్ 2 నగరాల్లో తమ ప్రదర్శనల ద్వారా భారతీయ ఫ్యాషన్ పెంచుతుందని నిర్వాహకులు తెలిపారు. సూత్ర ప్రదర్శనలో దుస్తులు, గౌన్లు, చీరలు, పాదరక్షలు, ఉపకరణాలు మరెన్నో విభిన్న డిజైనర్ ఉత్పత్తులను ప్రదర్శించారు. బేసిక్స్ సమిష్టిని ఎలివేట్ చేయడానికి, ఆశాజనకమైన డిజైనర్ కలెక్షన్‌లతో ప్రతిరోజూ స్టైలింగ్‌ను సులభతరం చేశామని నిర్వాహకులు తెలిపారు. ఇంకా తమ కస్టమర్ల కోసం భారతీయ మిశ్రమంతో అంతర్జాతీయ ఫ్యాషన్‌ల మధ్య కలయికను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రదర్శనలో కొంతమంది డిజైనర్లు పండోర ఆర్ట్‌గ్యాలరీ, సాఖ్ ప్రత్యేక దుస్తులు, సృష్టి రివాజ్, తక్ ప్రింట్లు నూర్ చేనేత, జై సోనీ డ్రీం స్టూడియో, కష్వీ చేనేత గణేష్ బోటిక్, మహాలక్ష్మి జ్యువెలర్, ట్రెండ్ సెట్టింగ్ డిజైనర్లు, విమ దిలీప్, గుల్దస్తా, కాశ్మీరీ ప్రత్యేక సేకరణలతో భారతదేశం నుంచి కొత్త వినూత్నమైన ఉత్పత్తులను ఏర్పాటుచేసింది.

పుంతల ముసలమ్మకు కూటమి నాయకుల పూజలు



పుంతల ముసలమ్మకు బొలిశెట్టి తదితరుల పూజలు

గణపవరం, మే 15: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరుణంలో అమ్మవారిని దర్శించేందుకు భక్తులు ఆలయాలకు పోటెత్తుతున్నారు. గణపవరం మండలం మొయ్యేరులో ఉన్న పుంతల ముసలమ్మను బుధవారం తాడేపల్లిగూడెం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధం సతీష్, కానుమిల్లి వెంకటేశ్వరరావు, ఇంటూరి చంద్రమోహన్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి, పొత్తూరిని కలసిన నాయకర్

నరసాపురం టౌన్, మే 15: జనసేన అభ్యర్థి నాయకర్ బుధవారం మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజును మార్యదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో తన విజయానికి ప్రచారం చేసినందుకు వీరిద్దరికి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో అంతా కలిసి పని చేద్దామని కోరారు. సునీల్, దొండపాటి స్వామి, గుబ్బల నాగరాజు తదితరులు ఉన్నారు.

పశువులకు దొమ్మవ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైటర్నరీ వైద్యులు

పాలకొల్లు అర్బన్, మే 15 : పట్టణంలోని రోడ్లపక్కన తిరిగే ఆవు లు, ఆబోతులు వంటి పశువులకు దొమ్మ వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో వేయించారు. బుధవారం జిల్లాపశు వైద్యశాఖా ధికారి డాక్టర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సొసైటీ ఫర్ ప్రవేక్షణరీ ఏజెంట్ యానిమల్స్, జీవ కారుణ్య సంస్థ (ఎన్‌ఈఎస్‌టి) సంయుక్త సహకారంతో 140 వీధి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏరియా పశువుల ఆసుపత్రి ఏడీ డాక్టర్ జి. మల్లేశ్వరరావు, ఎల్ఎస్‌ఏ సందీప్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. మొత్తంగా బుధవారం 140 పశువులకు టీకాలు వేశామని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు

సీబీఎస్ఈ ఫలితాలలో భారతీయ విద్యాభవన్స్ విద్యార్థుల ప్రతిభ



తరుణ్‌కుమార్ పాండా

భీమవరం ఎడ్యుకేషన్, మే 15 : తూర్పు, పశ్చిమ, ఏలూరు మూడు జిల్లాల్లో సీబీఎస్ఈ పది, పన్నెండు తరగతి ఫలితాలలో 98 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ ఎల్‌వీ రమాదేవి తెలిపారు. బుధవారం జరిగిన అభినందన సభలో భవన్స్ ఛైర్మన్ సీహెచ్ రంగనాథరాజు, సెక్రటరీ యూకే విశ్వనాథ రాజు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలతో మూడు జిల్లాలో ప్రథమస్థానంలో నిలిపినందుకు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. మేనేజ్మెంట్ వైస్ ఛైర్మన్ సీహెచ్ అచ్యుతరామరాజు, జిల్లా రైస్ మిల్స్ ఛైర్మన్ సామంతపూడి రామరాజు, జిల్లా కోశాధికారి క్రొత్త శ్రీనివాస్, మేనేజ్మెంట్ మెంబర్స్, ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులను అభినం దించారు. మూడు జిల్లాల్లోని పది ఫలితాలలో 98శాతంతో తరుణ్‌కుమార్ పాండా ప్రథమ స్థానం 490/500 మార్కులు సాధించాడని తెలిపారు.

గోతులమయంగా రహదారులు

నరకం చూస్తున్న ప్రయాణికులు



బి.కొండేపాడు - కోరుమిల్లి రహదారిలో గోతులు

పెంటపాడు, మే 15: రహదారులు గోతులతో దారుణంగా మారాయి. ప్రయాణికులు ప్రయాణాలు సాగించలేక నరకాన్ని చూస్తున్నారు. అడపా దడపా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే గోతులలో నీళ్ళు నిలబడి పోతు న్నాయి. బి.కొండేపాడు నుంచి కోరుమిల్లి, చింతపల్లి గ్రామాల మీదుగా కాశిపాడు చేరే రహదారి గోతులతో అధ్వానంగా ఉంది. టీడీపీ హయాంలో నిర్మించిన ఈ రహదారిని అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రహదారిని పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతతున్నారు. మండలంలోని ప్రత్తిపాడు-రాచర్ల రహదారి, ప్రత్తిపాడు- అలంపురం రహదారి, పడమరవిప్పర్రు తదితర రహదారులన్నీ గోతులతో అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా రహదార్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



పాలకొల్లులో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల తదితరులు.. పెంటపాడు, నరసాపురంల్లో కాటన్ విగ్రహాల వద్ద రైతు నాయకుల నివాళి

కాటన్ సేవలు చిరస్మరణీయం

ఘనంగా సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలు

చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళులు

పాలకొల్లు అర్బన్, మే 15 : రాబోయేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చెందిన రైతు ప్రభుత్వమేనని, కాటన్ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. డెల్టా అపర భగీరధుడు కాటన్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక లాకుల వద్ద గల కాటన్ విగ్రహానికి రైతులు, టీడీపీ, జనసేన నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటన్ సేవలు చిరస్మరణీయమన్నారు. 76 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గోదావరి జిల్లాల ప్రజలకు కాటన్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల టీడీపీ రైతు నాయకులు ఉంగరాల లక్ష్మీనరసింహారావు, పెచ్చెట్టి బాబు, అల్లు రాధాకృష్ణ, జీవీ, కోడి, మామిడిశెట్టి, కడటి గోపి, బోళ్ళ సుభాష్‌చంద్రబోస్, కొండ్రెడ్డి సూరిబాబు, ఇంటి శ్రీరాములు, అందే కోటి వీరభద్రం, దొంగ బాబాయ్, తాళ్ళూరి సత్యశ్రీనివాస్, బోణం నాని, చెరుకూరి అంజి తదితరులు పాల్గొన్నారు.

● పెంటపాడు : ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు సాగు, తాగు నీటి ఇబ్బందులు తొలగించిన సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు నల్లమిల్లి విజయ్ ఆనందరెడ్డి (అంజి) అన్నారు. కాటన్ జయంతి సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, రైతు సంఘం నాయకుడు బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెంటపాడు ఊరచెరువు వద్ద ఉన్న కాటన్ విగ్రహానికి రైతు కాటన్ క్లబ్ అధ్యక్షుడు నల్లమిల్లి వీరరాఘవరెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ జలమే భారతావని బలమని చాటిన మహనీయుడు కాటన్ అన్నారు. వంకా అప్పారావు, వెలగల నర్సిరెడ్డి, వెలగల శ్రీనివాసరెడ్డి, కర్రి పృథ్వీరెడ్డి, కర్రి శివాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తణుకు : అన్నదాత ప్రాణ ప్రదాత కాటన్ దొర అని సాహితీ సామ్రాజ్యం జిల్లా అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అన్నరు. బుధవారం కాటన్ జయంతి సందర్భంగా సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉన్న కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాటన్‌పై సదస్సు నిర్వహించారు. అనంతరం ఏఈ నల్లజర్ల బాల మురళీకృష్ణను సత్కరించారు. డాక్టర్ తాతిన రామబ్రహ్మం, డాక్టర్ జీఏఎస్‌వి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

● నరసాపురం రూరల్ : గోదావరి జిల్లాలను కరువు నుంచి కాపాడి భూములను సశ్యశ్యామలం చేసిన అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ దొర అని, రైతుల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలుస్తారని పలువురు రైతులు అన్నారు. బుధవారం కాటన్ జయంతి పురస్కరించుకుని కొప్పర్రు గ్రామ సొసైటీ భవనం వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు మిత్ర సేవకుడు చినమిల్లి వీరబాబు, ముక్కు గణపతి, పోలిశెట్టి సత్తిబాబు, సత్యనారాయణ, శివ పాల్గొన్నారు.

● గణపవరం : కాటన్ మహాసేయుడు తన జీవితాన్నంతా దేశంలో నీటిపారుదల, నావికా యోగ్యమైన కాల్వలు కట్టించడానికి ధారపోశాడని టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు కొనియాడారు. కాటన్ 122వ జయంతి పిప్పర టీడీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచారు. రానున్న కాలంలో కాటన్ మహాశయుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామన్నారు. అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, కూసం పూడి సురేంద్ర కుమార్‌రాజు, కాపారం చిన్న, ఇందుకూరి మారిరాజు, సీదెల్ల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి ఏసుబాబు, కొలనువాడ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

● పెనుమంట్ర : కాటన్ జయంతి వేడుకలు పురస్కరించుకుని ఇరిగేషన్ సెక్షన్, మార్టేరు కార్యాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుబ్బల జయశంకర్ కాటన్ దొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జిల్లాలకు తాగు, సాగునీరు అందించిన అపర భగీరధుడు కాటన్ దొర అన్నారు. కార్యక్రమంలో ఐసీ అసిస్టెంట్స్ ఎన్. బాబులు, సీహెచ్. ఎస్.ఆర్.ఎస్. శర్మ, లాక్ సూపరింటెండెంట్ వి.జోసఫ్, సిబ్బంది పాల్గొన్నారు

● భీమవరం టౌన్: ధవలేశ్వరం బ్యారేజీ నిర్మాణంలో కాటన్ దొరకు మన గోదావరి జిల్లా ఇంజనీరు ఈణెం వీరన్న ఎంతగానో సహకరించి పూర్తి చేయడానికి కృషి చేశారని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీ రామరాజు అన్నారు. ఇంజనీరు ఈణెం వీరన్న వర్ధంతి కార్యక్రమం బుధవారం రైతు కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. వీరన్నతో పాటు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి నాయకులు కలిదిండి నాగరాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, మంతెన కృష్ణంరాజు, వేగేశ్న సత్యనారాయణరాజు, ముదునూరి సత్యనారాయణరాజు, దాట్ల లక్ష్మీపతిరాజు, కమలాకర్‌శర్మ, కృష్ణారావు, అప్పల రామకృష్ణంరాజు, వెంకట భీమరాజు, వీఎస్ఎన్ రాజు, దంతులూరి మరళీ కృష్ణంరాజు, సీతారామరాజు, పోశింశెట్టి మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద భక్తుల నిరసన



ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న భక్తులు

పెంటపాడు, మే 15: పెంటపాడు బాల వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు స్వామివారికి నిత్య ధూప దీప నైవేద్యాలపై తీవ్ర నిర్లక్షం ప్రదర్శిస్తున్నారంటూ భక్తులు బుధవారం ఆలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 135 ఏళ్ల చరిత్ర ఉన్న పురాతన ఆలయానికి అర్చకుల జీతం నిమిత్తం 23 ఎకరాలు, స్వామి దూప దీప నైవేద్యం కోసం 28 ఎకరాలు ఉన్నాయన్నారు. గుడికి సంబంధించిన అర్చకులు వేరే ప్రాంతాల్లో ఉండటం వల్ల ఒక అర్చకుని జీతానికి నియమించారన్నారు. ఆ ఆలయానికి ఒక అర్చకుడు సరిపోడని మరో అర్చకుడిని నియమించాలని ప్రస్తుతం చేస్తున్న అర్చకుడు పలుమార్లు కోరాడని అయినా ఇప్పటివరకూ నియమించలేదన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న అర్చకుడు కూడా మానేశాడని స్వామికి సక్రమంగా నిత్య దూప నైవేద్యాలు కూడా జరగడం లేదన్నారు. సుమారు నాలుగు నెలల నుంచి ఇదే పరిస్థితి కొసాగుతున్నా ఆలయ ఈవో చీమలకొండ సాయి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. సత్వరం సమస్యను పరిష్కరించి స్వామి వారికి సక్రమంగా పూజలు జరిగేలా చూడాలని కోరారు.

రామన్నపాలెం పీఎస్‌లో 93.90 శాతం పోలింగ్

ఆచంట, మే 15 : సార్వత్రిక ఎన్నికల్లో ఎపుడూ లేనివిధంగా ఈసారి ఓటర్లు ఓటు వేయడానికి పోటెత్తారు. నియోజకవర్గంలో 82.76 శాతం పోలింగ్ నమోదు కాగా, కొన్ని పోలింగ్‌కేంద్రాల్లో ఏకంగా 90 శాతంపైగానే పోలింగ్ నమోదైంది. పెనుగొండ మండలం రామన్నపాలెంలో పీఎస్ నంబరు 24లో 1033 మంది ఓటర్లుకు 970 ఓట్లు పోలై 93.90 శాతం నమోదైంది. మరొక పీఎస్ నంబరు 25లో యర్రంశెట్టివారిపాలెంలో 1027 ఓటర్లుకు గాను 926 మంది తమ ఓటు హక్కును సద్వినియోగించుకోవడంతో 90.17 శాతం, అదే మండలంలో పీఎస్ నంబరు 66లో కొఠాలపర్రు గ్రామంలో 951 మందికి గాను 857 మంది ఓటింగ్‌తో 90.12 శాతం పోలింగ్ నమోదైంది. పీఎస్ నెం. 68లో మునమర్రులో 832 ఓటర్లకు గాను 749 మంది పోలింగ్‌తో 90.02 శాతం, అత్యల్పంగా ఆచంటలో పీఎస్ నంబరు 98కి సంబంధించి 1082 ఓటర్లకు 787 మంది పోలింగ్‌తో 72.55 శాతం నమోదైంది. పెనుమంట్ర మండలం పీఎస్ నంబరు 110కి సంబంధించి మార్టేరులో 839 మంది ఓటర్లకు గాను 618 మంది పోలింగ్‌తో 73.66 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు.

కొత్తూరులో అత్యధిక పోలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, మే 15: ప్రతిష్ఠాత్మకంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు 50వ పోలింగ్ బూత్‌లో 95.93 శాతం ఓట్లు పోలై నియోజకవర్గంలోనే అత్యధికగా పోలింగ్ జరిగిన బూత్‌గా నిలవగా, అత్యల్పంగా పట్టణంలోని 109వ పోలింగ్ బూత్ 60.14శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం మొత్తంగా 81.86 శాతం ఓట్లు పోలైనట్టు రిటర్నింగ్ అధికారి కె. చెన్నయ్య వెల్లడించారు.

వైభవంగా అతిరాత్ర మహాయాగం ప్రారంభం



ప్రముఖులకు వేద ఆశీర్వచనం అందిస్తున్న వేదపండితులు

భీమవరంటౌన్, మే 15 : డీఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఉమా రామలింగేశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో రాజాశ్యామల దశమహావిద్య సహిత అతిరాత్ర మహాయాగం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఈనెల 26వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళ వాయిద్యాలు, భక్తుల శివనామస్మరణ వేద పండితుల మంత్రాలతో యాగం నిర్వాహకుడు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ, కార్తీక మాధవి దంపతులచే పూజలు నిర్వహించారు. అనంతరం అగ్నిమదనం చేసి హోమాలను ప్రారంభించారు. అధర్వణ వేద పండితులు ధూళిపాల లలిత శర్మ మాట్లాడుతూ లోకంలో అతిరాత్ర మహాయాగము చాలా అరుదు అని, భీమవరం పట్టణంలో ఈ యాగం జరగడం వల్ల ఐదు అరు వందల కిలోమీటర్ల ప్రాంతమంతా సుభిక్షంగా సస్యశ్యామలంగా ఉంటుందన్నారు యాగ ప్రారంభ కార్యక్రమంలో డీఎన్ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహారాజు, కార్యదర్శిగా దిరాజు సత్యనారాయణరాజు, యాగ సంధానకర్త, సేవ్ టెంపుల్స్ ఛైర్మన్ గజల్ శ్రీనివాస్, గన్నాబత్తుల శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ నాయకుడు మంతెన రామచంద్రరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, నడింపల్లి బంగార్రాజు, ఉద్దరాజు విశ్వనాథరాజు, హిందూ పరిషత్ మంతెన రామచంద్రరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆక్వా పరిశ్రమల భీమాల శ్రీరామ్మూర్తి, గోకరాజు పాండు రంగరాజు, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

పడాలలో బలుసులమ్మ జాతర ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్, మే 15: పడాలలో ఏడు దశాబ్దాల తరువాత నిర్వహిస్తున్న గ్రామదేవత బలుసులమ్మ జాతర బుధవారం కన్నుల పండువగా ప్రారంభించారు. గ్రామంలోని అమ్మవారిని పూరిగుడిసెకు పరగంగను ఊరేగింపుగా గరగ నృత్యలు, మేళ తాళాలతో తీసుకెళ్లారు. 17వ తేదీ రాత్రి సేవా కార్యక్రమం, 18వ తేదీ రాత్రి అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈనెల 19న జాతర నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.

27 నుంచి దేశాలమ్మ జాతర

పాలకొల్లు అర్బన్, మే 15 : స్థానిక భీమవరం రోడ్డులో లాకుల వద్ద ఉన్న దేశాలమ్మ జాతర ఈనెల 27 నుంచి జూన్ 2వ తేదీ వరకూ వైభవంగా జరగనున్నాయి. ఆలయ 52వ జాతర సందర్భంగా భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అదేరోజు రాత్రి యలమంచిలి మండలం శిరగాలపల్లి సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి అమ్మవారికి పూజలు చేసి జాతర ప్రారంభిస్తారు. లాకుల వద్ద నుంచి అన్నపూర్ణ థియేటర్ వరకు 12 స్టేజీలు వేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. జాతరలో భాగంగా 28వ తేదీ మంగళవారం పట్టణంలో గ్రామోత్సవం, ఆఖరి రోజు జూన్ 2వ తేదీ రాత్రి నూతన దంపతులు మజ్జి దుర్గా సత్యేంద్ర, లక్ష్మీ అమ్మవారికి లక్ష మల్లెల పూజ, జూన్ 7వ తేదీ శుక్రవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహిస్తారు.

వాసవీ మాత ఆలయంలో కుంకుమార్చనలు

పెనుగొండ, మే 15 : నగరేశ్వర మహిషాసుర మర్ధని, వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బుధవారం సుహాసినీలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు పెనుగొండ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అధికసంఖ్యలో విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఈవో గుబ్బల రామపెద్దింట్లు తెలిపారు.

మందాలమ్మ ఆలయానికి రూ.30 వేలు విరాళం



పెనుగొండ, మే 15 :వడలి గ్రామదేవత మందాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా తమ్మినీడి శాంతకుమారి కుటుంబ సభ్యులు 30,116 రూపాయలు విరాళం బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా శాంతకుమారి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

ఉక్కపోతతో ప్రజలు బెంబేలు

నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు



భీమవరంలో నిర్మానుష్యంగా వున్న రోడ్డు

భీమవరంటౌన్, మే 15 : వేసవి తాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. వాతావరణంలో మార్పుతో రెండు రోజుల క్రితం వర్షం కురవడంతో దాని ప్రభావం ఎండ మరింత పెరిగింది. ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు చూపిస్తున్నప్పటికీ ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దాహార్తి కోసం పట్టణంలో పలు చోట్ల ఏర్పాటుచేసిన చలివేంద్రాలు కిటకిటలాడిపోతున్నాయి. మధ్యాహ్నం సమయానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. చెరుకు రసం, ముంజి కాయులు, డ్రింక్‌లకు గిరాకీ పెరిగింది. ఇంకా కరెంటు కోతలు అమలు చేయకపోవడంతో కాస్త ఊరటగా ఉంటోంది. ఇప్పుడే ఇలా ఉంటే మరి కొద్ది రోజుల్లో రోహిణి కార్తె ప్రారంభమైతే పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

టీడీపీ కార్యకర్తకు 'పితాని' ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

పెనుమంట్ర,మే 15 : బ్రాహ్మణ చెరువు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త గుబ్బల సత్యనారాయణ ఎన్నికల ప్రచారంలో సైకిల్‌తో విన్యాసాలు చేస్తూ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. నడుముకు బలంగా దెబ్బ తాకడంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సొమ్మును గుబ్బల సత్యనారాయణ కుటుంబానికి తిరుమల గ్రామ పార్టీ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు అందజేశారు. ఫోన్‌లో పితాని సత్యనారాయణ మాట్లాడి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేతలి గోపిరెడ్డి, కోప్పిశెట్టి సూరయ్య, నరాలశెట్టి వెంకటేష్, గంజా సుబ్రహ్మణ్యం, బాణం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి జనసైనికుల సాయం



నగదు అందిస్తున్న పులపర్తి అంజిబాబు

భీమవరంటౌన్, మే 15 : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో జన సైనికులు ముందుకు వచ్చి సాయం అందించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం 17వ వార్డు బంట్రోతు వారివీధికి చెందిన ప్రమాద బాధితునికి జనసైనికులు రూ. 37 వేలు సహకారం అందించారు. 17వ వార్డుకు చెందిన ఉద్దిసి వాసు ఇటీవలే తాడేపల్లిగూడెం వెళుతుండగా జరిగిన ప్రమాదంలో రెండు కాళ్ళు దెబ్బతినడంతో జనసైనికులు రెడ్డి సత్తిబాబు, కొప్పినిడి శ్రీను, సంగినీడి వెంకటేశ్వరరావు, ఆముదాలపల్లి సాయినాథ్, గాడి శివప్రసాద్, బుసుపు శ్రీను, చెన్నంశెట్టి వినయ్ కలిసి రూ.37వేలు మాజీ ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు.

రైతులకు సంచులు అందించి ధాన్యం కొనాలి



ఆర్డీవో అంబరీష్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

నరసాపురం టౌన్, మే 15: రైతులకు ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు అవసరమైన సంచులు సరఫరా చేసి తక్షణం పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బుధవారం ఆర్డీవో అంబరీష్‌కు టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోను కలిసి సమస్యను వివరించారు. వర్షాలు కురుస్తాయన్న భయం రైతుల్లో నెలకొందన్నారు. చాలాగ్రామాల్లో రైతులకు సంచులులేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. వాతాడి ఉమా, అందే రామకృష్ణ, జక్కం కాశీ పాల్గొన్నారు.

పెనుమంట్రలో కిల్కారి యాప్‌పై అవగాహన



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

పెనుమంట్ర, మే 15 : పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు కిల్కార్ మొబైల్ సేవలపై వైద్యాధికారి డాక్టర్ కె.లావణ్య, పి.కనక ప్రియ వివరించారు. బుధవారం పెనుమంట్ర పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ గర్భిణిగా ఉన్న నాలుగు నెలల కాలం నుంచి బిడ్డ పుట్టిన తరువాత ఏడాది వరకు ఏవిధంగా చర్యలు తీసుకోవాలో వివరించారు. ఇది పూర్తిగా ఉచితమని, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఈ అకాడమి పనిచేస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఏఎన్ ఎం వద్ద నమోదు చేసుకున్న మొబైల్ నంబరుకు ఫోన్‌చేసి ఆశా కార్యకర్తలు కిల్కారీ మొబైల్ అకాడమి నుంచి సమాచారం పొందాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో 14 మంది చాంబర్స్ విద్యార్థులు

పాలకొల్లు అర్బన్, మే 15 :స్థానిక చాంబర్స్ డిగ్రీ, పిజీ కళాశాలకు చెందిన 14మంది విద్యార్థులు జిల్ ఇండియా కంపెనీకి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. తమ కళాశాలలో బుధవారం జరిగిన ప్రాంగణ ఎంపికలో 58 మంది హాజరు కాగా కళాశాలకు చెందిన 14 మం ది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి నెలకు రూ.22వేలు వేతనం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల పాలక మండలి ఛైర్మన్ కేవీఆర్ నరసింహారావు ధ్రువపత్రాలను అందించారు. కార్యదర్శి కలిదిండి రామరాజు, జిల్ హెచ్ఆర్, హేమభూషణ్, మేనేజర్ వెంకట రమణ, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు, కళాశాల ట్రైనర్ కె.సంతోష్ ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేగేటు విరగడంతో స్థానికులకు ఇక్కట్లు



దుంపగడపలో విరిగిన రైల్వేగేటు

ఆకివీడు, మే 15: దుంపగడపలో రైల్వేగేటు బుధవారం విరిగింది. గేటు మరమ్మతు సమయంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మరమ్మతులు పూర్తయ్యే వరకు ఇనుప రాడ్‌లు అడ్డంగా ఉంచారు. స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం రైల్వే సిబ్బంది మరమ్మతులు చేసి యథావిధిగా గేటును వేశారు.

అనారోగ్యంతో హోంగార్డు శివ మృతి



శ్రీమన్నారాయణ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, మే 15: తాడేపల్లిగూడెం పట్టణంలో 40 ఏళ్ల పాటు హోం గార్డుగా సేవలందించిన సీహెచ్ శ్రీమన్నారా యణ అలియాస్ శివ (60) అనారోగ్యంతో బుధవారం తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసంలో మృతి చెందారు. కొంత కాలంగా శివ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఆయన మృతదేహాన్ని ఆర్ఎస్ఐ సత్యనారా యణ, హోంగార్డు యూనిట్ సందర్శించి, అయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలకు రూ.10 వేలు అందించారు.